# వట్టి పట్టుదలతప్ప యేమీ లేదు

"ఏొసేవ్! చూశావా? యెలా చెక్కేశానో దాని పుస్తకాన్ని సిగ్గూ, బిడియమూ వుంటే యిక కలం పట్ట దా అమ్మాయి. ఆడదై వుండీన్నీ తగుదు నమ్మా అని కథలు రాసి పత్రికలకు పంపడమే కాకుండా ఆ కథలన్నీ పుస్తకంగా అచ్చు వేయించడమే కాకుండా పైగా వెధవ గ్రామ్యంలో రాస్తుందీ. భాషని పాడుచేస్తున్నారు కుర్రగాళ్లంతా. పది చోట్ల పది సభలు చేయించి గ్రామ్య వాదాన్ని ముక్కల కింద తెగకొట్టేదాకా నేను నిద్రపోను. ఈ వేసవి కాలపు సెలవులు నెలాపదిహేనురోజులూ నాకిదో పని. మహా ఆంద్రిబ్బ ప్రబలిపోతోంది. వీళ్లని ఫండితులు వూరుకున్నకొద్దేని" అని రామశాస్త్రి విజయగర్వాన్ని ప్రకటిస్తూ పెళ్లాంతో చెప్పాడు. ఆవిడ "మీరు సభల కోసం తిరిగితే మరి నాగజ్జెల పట్టెడ మాటయేమిటండీ" అంది దాని మీద కొంత వాద ప్రతివాదాలు జరిగాక ముందు గజ్జెల పట్టెడ చేయించే దిగ్విజయానికిద్దరూ రాజీపడ్డారు.

"భాషావిషయాలు నీకు తెలవవు గాని అయినా కొంచెం వింటావా"

"ఏం లాభ మండీ తెలవనప్పుడూ"

"వూరికే వక్క పేజీ విను"

"నాకు లంకాయానిఁ తెచ్చిపెట్టరూ"

ఇది విందూ తరువాత చూసుకుందామూ. ఎవతెయో సత్యవతి యను నామె యొక చిన్నకథల పుస్తకముం బ్రకటించినది. అది యంతయు గ్రామ్యభాషాభూయిష్టం బైయుండుదుందియ్యని యాంధ్రభాషామతల్లికి సంభవింపుచున్న యిక్కట్టులం జూడంగాఁజాలక నేనీ ఖండనగ్రంథంబు లిఖింపఁ దొరకొంటిని. దీనిం జూచినపిదపం గూడ నాలలన తన దుర్మార్గంబును త్యజింపకుండు నేనిఁ దరువాత నే నబల యంచు నుపేక్ష సేయక కదుందీవ్రంబుగ విమర్శించి ఖండింపంగా వలసివచ్చును. త్రిలింగవిషయంబునందలి పుటభేదనంబులయం చన్నింటను గ్రామ్యభాషావిధ్వంసనదీక్షాకంకణధారణంబుం గావించియున్నవారు సభలం జరిగింపం బూనుకొందుర యేని నేను విజయంబుచేసి అస్మద్గంగానిర్ఘరవద్రుక్ష వాగ్ధాటితో గ్రామ్యవాదంబుల దెగ నటికి గ్రాంధికభాషను ప్రతిష్ఠించెద. పత్రికాధిపతు లందఱును నాకుం దోడ్పడియెద రను విశ్వాసంబుతోడ నేను బ్రయాణ సన్నాహంబుం బూర్తిచేసికొని సర్వసిద్ధంబుగ నున్నవాడ" ఇది పీఠిక. ఇక్కడికే నువ్వుక్కిరిబిక్కి రైవుంటావు. ఆడాళ్ళ కేం తెలుస్తాయీ యిలాంటి శాస్త్రీయవిషయాలూ ఇదిగో ముందు యీవూళ్ళో సభ చేయించడానికి ప్రయత్నించడానికి వెడుతున్నాను."

"మళ్ళీ యెప్పుడువస్తా రండీ"

"అంటే"

"ఇంటికి యెప్పుడు వస్తారూ"

"రాత్రి యెనిమిదో తొమ్మిదో అవుతుంది. నాకోసం ....."

"అయితే నేనోమారు మా పిన్ని గారి యింటికి వెళ్ళి వస్తానండి......"

"తొరగా రావాలి సుమా"

ఇలా చెప్పి రామశాస్త్రి ..... వీధిలోకి వెళ్ళిపోయారు. వీధిలోని తలుపు వేసుకొని పడకటింటోకి వెళ్ళిపోయింది రుక్మిణి.

## 2

కొంపలి రామశాస్త్రికి నలభైయేళ్ళ వయస్సుంటుంది. అతను రాజమండ్రి మిషను హై స్కూలులో తెలుగు పండితుడుగా వున్నాడు. ఆంధ్రభాషలో మంచి ప్రవేశం వుంది. మొత్తానికి పండితులలోనే లెక్కపెట్టవచ్చు. అతను నాలుగేళ్ళ క్రితమే వొక ఉపకావ్యం రాశాడుగాని దాని ప్రతులు అన్నీ బీరువాలోనే వుండిపోయాయి. అది మొదలు అతను పుస్తకాలు రాయడం మానేసి విమర్శనల మీద పడ్డాడు. మంచి పుస్తకం కంటబడితే "యిక చెక్కేసి విడిచి వెడతా" నంటూ కలమూ, కాగితాలూ పుచ్చుకొని కూచుంటాడు. అందులోను వ్యావహారిక భాషకి ఆదరం వచ్చాక – ఆ భాషలో రాసే కుర్రాళ్ళు ఎక్కడ చూసినా అనేకమంది బయలుదేరాక అతనికి మరింత చురుకువచ్చింది. "కవి సింహ శరభసాళ్వ" మనీ, "కవిమత్తేభశార్దూల" మనీ, "దుర్వాదనీహార సూర్య" మనీ యింకా యిలాంటి పేర్లతో అతడాధునికుల పుస్తకాలమీద అనేక ఖండనగ్రంథాలు రాసి సొంతంగా ప్రకటించాడు. పత్రికలకి, అనేక వ్యాసాలు రాశాడు. అనేక సభలలో వుపన్యసించాడు. ఒకటిరెండు సంస్థానాలలో వెయ్యిన్నూటపదహార్లు నెలకేసి నూటపదహార్లుకూడ సంపాదించాడు. తన పాండిత్యం మహిమ చూపించీ ప్రస్తుతం అతను సత్యవతి చిన్న కథలని ఖండించడం తొందరలో వున్నాడు. సత్యవతి – రెండు మూడువ్యాసాలికి జవాబులు కూడా యివ్వడంచేత మరింత పని కలిగిం దతనికి. ఆమెకూ అతనికీ మొదట భాషానిర్ధారణలోనే పేచీ వచ్చింది. అతను ఆమె వ్యావహారిక భాషనీ గ్రామ్యభాష అనీ, ఆమె అతని గ్రాంధిక భాషని మృతభాష అనీ పిలవడం మొదలుపెట్టారు. ఇంతట్లో వేసవిసెలవులు వస్తూవుండడంచేత దేశం అంతా తిరిగి ప్రతీపట్టణంలోనూ సభలలో వుపన్యాసా లివ్వడాని కతను పూనుకున్నాడు.

రుక్మిణి నాలుగోక్లాసుదాకానే బళ్ళో చదువుకుంది. తండ్రి గొప్ప సంస్కృతపండితుడు కావడంచేత చిన్నప్పు డామెకి కాళిదాసత్రయం దాకాసంస్కృతం చెప్పే డంటారు గాని ఆలక్షణా లేమీ ఆమె దగ్గిర కనపడవు. మొగుడు స్కూలుకి వెళ్ళగానే తలుపులు బిగించుకొని యింటో కూచుని అస్తమానూ

యేదో రాయడమో చదవడమో చేస్తూవుంటుం దని కూడా వకరిద్దరు చెబుతారు గాని దానిక్కూడా నిదర్శనాలు కనపడవు. ఆమె చిన్నన్న యగు శోభనాచలం తాలూకాకచేరీలో గుమాస్తాగా రాజమండ్రీలోనే వుండడం చేతనూ పైగా అతడు వెనక వీధిలోనే వుండడంచేతనూ రుక్మిణి తరుచు అక్కడికి వెళ్ళి కూచోడం వుంది. అయితే అక్కడ వదినగారూ ఆవిడా యేంచేస్తూవుంటారో యెవరూ యెరగరు. శోభనాచలానికి వ్యావహారిక భాష అంటే చాలా యిష్టం. సత్యవతికీ రామశాస్త్రికీ ప్రవర్తిల్లిన వాదంలో అతనుగూడా చేరి రెండుమూడువ్యాసాలు రాశాడు: గాని రామశాస్త్రి అత డెదుటికివచ్చినప్పుడు "నీకేం తెలుసునోయి భాషసంగతి?" అని తీసేస్తూవుంటాడు.

## 3

"నా చెల్లెల్ని కాస్త చూస్తూవుండు" అని శోభనాచలానికి చెప్పి శాస్త్రి సెలవులు వచ్చీ రావడంతోటే జైత్రయాత్రకు బయలుదేరాడు. గజ్జెలపట్టెడ సంగతి చెప్పి రుక్మిణి వెళ్ళడానికి వల్లకా దని కొంచెం పట్టుపట్టింది. గాని "మీ యన్నయ్యద్వారా చేయించుకో" అని రూపాయ లివ్వడంచేత సరే అని వూరుకుంది.

శాస్త్రి ఏలూరూ, బెజవాడా, గుంటూరూ, గుడివాడా, బందరూ, తెనాలీ, నెల్లూరూ, చిత్తూరూ, వగైరా కొన్ని వూళ్ళలో వ్యావహారిక భాషమీద వుపన్యాసాలు. పేల గొట్టేశాడు. గాని యెదురువాదానికి సరిగా జవాబులు చెప్పలేకపోయినాడు. "అది శాస్త్రవిరుద్ధమైన భాష. పూర్వకవు లెవ్వరూ దాన్ని అంగీకరించి గ్రంథాలలో వాడలేదు. వాడినవాళ్ళు ప్రామాణికులు కారు" ఇంతే అతని వాదంలో వుండే సారాంశం. ప్రతిపట్టణంలోనూ, ప్రతీసభలోనూ వ్యావహారిక భాషావాదు లతని యుక్తుల్ని ఖండించకుండా వుండలేదు. వకటిరెండు వూళ్ళలో అగ్రాసనాధిపతులు "శాస్త్రీగారికి గ్రాంథిక భాష మీద వుండేంత పాండిత్యం లేదు. ఇది వరకు గ్రాంథికవాదులు చెప్పిన యుక్తులే- అనేకమాట్లు నలిగిపోయిన భావాలే చూపిస్తున్నారు గాని వీరి వాదంలో కొత్త సంగతులేమీ లేవు. వ్యావహారికం వద్దంటే అది నిలిచిపోదు. గ్రాంథికం కావాలంటే అది సర్వత్రా సాగదు. వీరి ప్రయత్నం అంతా కేవలమూ వ్యర్థము. శాస్త్రిగారికి వ్యావహారికంమీద ద్వేషమూ, గ్రాంథికంమీద అభిమానమూ వుంటే వ్యావహారికంచెంతకీ పోక గ్రాంథికంతో కులుకుతూ వుండడం మంచిది పైగా సత్యవతిగారి పుస్తకాన్ని విమర్శించడంలో, వీరు అసభ్యవాక్యాలు కొన్ని ప్రయోగించారు. అదీ కాకుండా వ్యావహారికమే గ్రామ్యమంటారు. ఇది చాలా అక్రమైన వాదం. గ్రామ్యం అంటే శిష్టులు ఉచ్చరించరాని మాటలు. మనం అంతా మాట్లాడేదీ వ్యావహారికం. శాస్త్రీగారు గ్రహించలేదు గాని గ్రంథాల్లోకి యెక్కుతూ వుంది కనక యిప్పుడు వ్యావహారిక భాషాకూడా గ్రాంథికమే అయిపోయింది. అయినా ప్రత్యేకత నిలవడం కోసం దాన్ని వ్యావహారికభాష అని పిలవడమే మంచి" దని తను అంత్యోపవ్యాసాలలో చెప్పారు.

ఇది యిలా వుండగా పత్రికలలోపడ్డ రిపోర్టులు చదివి సత్యవతికూడా శాస్త్రి ఉపన్యాసాలు విమర్శించింది. శాస్త్రి వుపన్యాసాలకోసం తిరిగిన నెల్లాళ్లలోనూ సత్యవతి రాసిన కొత్త కథలు పదిపన్నెండు మంచిపత్రికలలో పడ్డాయి. కొన్ని సభలలో ఆ కథలు చదువుతూ కొందరు వ్యావహారిక భాషలో – అందులోనూ సత్యవతి శైలిలో వుండే మాధుర్యాన్ని చూపుతూ శాస్త్రీ నెదురుకోవడం మొదలుపెట్టారు.

దీనితో యింకా ముందుకు వెడదా మనుకున్న శాస్త్రి గిరుక్కున వెనక్కి మళ్ళాడు. ఈమధ్య పత్రికలలో తన వుపన్యాసాల సంగతులే తరుచు పడుతూ వుండడంచేత ఆవేళ వచ్చిన ఆంధ్రపత్రికకోసం పదిమాట్లు బెజవాడస్టేషను ప్లాటుఫారం అంతా తిరిగి చివరికి సంపాదించాడు. దాన్ని విప్పడంతోటే "సత్యవతి, రామశాస్త్రిగార్ల భాషాచర్చలు రాజమహేంద్రవరంలో ప్రత్యేకసభకోసం తీవ్రమైన ప్రయత్నాలు సత్యవతిగారు సభకి వచ్చిన తమ వాదాన్ని వినిపించడాని కంగీకరించారు. శాస్త్రిగారుకూడా అంగీకరిస్తాదని నమ్మబడుతోంది. పంచాయితీగారెవరికి జయం యిస్తే వారికి నూటపదహారురూపాయల బహుమతీ యివ్వడాని కేర్పాట్లు జరిగాయి" అని యిలాగ చాలా రిమార్కులతో వక లేఖ కనపడింది. వెంటనే అతని రక్తం వేడెక్కిపోయింది. దాన్ని పదిమాట్లు చదివాడు. రాజమండ్రీ యెప్పుడు చేరుకుంటానా అని కంగారుపడ్డాడు. ఏలూరు వచ్చాటప్పటి కత నొక వుత్తరం–సేవా సభలో నావాదం వినిపించడానికీ పంచాయితీదార్ల తీర్పు నంగీకరించడానికీ సిద్ధంగా వున్నా" నని రాసి దానిని ఏలూరుస్టేషనులో వున్న వుత్తరాలడబ్బాలో పడేసి మళ్ళీ బండిలో కూచుని విజయం తనకి వచ్చినట్లే సంతోషపడ్డాడు.

## 4

"ఇదేమిటండీ అంతగా చిక్కిపోయారూ? సరిగ్గా భోంచేశారా? నిద్రపోయినారా? అయ్యో సగం అయిపోయా" రండీ అంటూ శాస్త్రి గుమ్మంలోకాలు పెట్టాటప్పటికి రుక్మిణి ప్రత్యుత్థానం చేసి కాళ్ళు కడుక్కోనికి నీళ్ళిచ్చి స్నానానికి వేన్నీళ్ళు పెట్టి స్వయంగా తలంటింది. స్నానం పూర్తి అయాటప్పటికి అత నామెకి తెలవదని నిశ్చయం చేసుకున్న గ్రాంధిక వ్యావహారిక భాషావివాద విషయంలో తాను పడ్డ శ్రమా, జరిగిన గౌరవమూ అంతా చెప్పేశాడు. అంతా విని ఆమె "లోకంలో అనేకమంది వుండగా యీబాధ మీ కొక్కరికీ యెందుకండీ?" అనగా "భాష తగులడిపోతూ వుండగా నావంటి పండితుడు వూరికే కూచోగలడా?" అన్నాడు. "పోనీ అదేదో ఆభాషనికూడా చాలామంది అంగీకరిస్తున్నా రన్నారుగాదా మీరుకూడా అంగీకరించరాదా?" అని ఆమె మళ్ళీ అనగా "నీముఖం నీకేం తెలుసు నదంతా? గ్రామ్యభాష నంగీకరించమంటావూ? ఇక రేపణ్ణుంచి యెరకలాళ్ళుకూడా కవిత్వం చెయ్యరూ! ఎన్నో కట్టుదిట్టాలు చేసి జనసామాన్యానికి లొంగకుండా చెయ్యడంచేతనే

సంస్కృతం యిప్పటిదాకా నిలిచింది. గ్రాంధిక భాషకి కూడా అలాంటి కట్టుదిట్టాలు వుండడం చేతనే అది గ్రంథాల్లోనేనా వుంది గాని లేకపోతే - యీపాటికి దేశం అంతా గ్రామ్యభాషతో కుళ్ళిపోయి వుండదూ" అని జాడించి చెప్పాడు. "వారంరోజులలో సత్యవతివాదాన్నీ, నావాదాన్నీ వినడం కోసం యీవూళ్ళో పెద్దలు సభ చేస్తున్నారు. దానిలో నెగ్గినవాళ్ళకి నూటపదహార్లు బహుమతీయిస్తారట. చూస్తూ వుండు నిమిషంలో నేనా బహుమతీని సంపాదించేస్తా" నని కూడా చెప్పాడు. దానిమీద రుక్మిణి మందహాసం చేస్తూ "ఆబహుమతీని మీరు గెలిస్తే నాకిచ్చేస్తారా!" అనగా అతను "ఆసొమ్ము వాడుకోడానికి వల్లకాదు. ఇంకా పూర్వకవి గ్రంథాలు కొన్ని సంపాదించవలసియున్నాయి నీకివ్వ" "నన్నాడు. "సగ మేనా పాతికేనా యివ్వండీ" అని ఆమె కోరగ్గా అతను దమ్మిడీకూడా యివ్వనన్నాడు.

స్నానం అయిన వెంటనే బట్టలు కట్టుకుని శాస్త్రీ టౌన్‌హాలుకి వెళ్ళేడు. అక్కడ వున్న వారంతా శాస్త్రికి స్వాగతం యిచ్చి దేశం అంతా తిరిగి వుపన్యాసా లిచ్చి వచ్చినందుకు ప్రశంసించారు.

వారంరోజుల్లో జరగబోయే సభ ప్రస్తావన వచ్చాటప్పటికి శాస్త్రి ఆవేశంతో చిన్న వుపన్యాసం చేసేశాడు. "బహుమతీ వక్కటే చాలదు. నేను వోడిపోతే నావాదాన్నీ వదులుకొని వ్యవహారికంలోకి దిగుతాను. నా వుపన్యాసాలూ, వ్యాసాలూ, వెనక్కి తీసేసుకుంటాను. పుస్తకాలు దిద్దేస్తాను. ఆమె వోడిపోతే...వెయ్యాలి" అని అతను చెప్పగా అంతా బాగుందన్నారు. "ఇంతకీ ఆమె యేవూళ్ళో వుంది ఏ వర్గం, ఎవరి భార్య వయస్సెంత" అనీ శాస్త్రి యింకా కొన్ని ప్రశ్నలు వేశాడు. గాని అంతా... ఏమో మాకు తెలవదంటే మాకు తెలవదన్నారు. "మరీ యీసభ సంగతి యెవరు నిర్ధారించేరు?" వాణీవిలాస పుస్తక భాండాగారంవారు చేశారట" అన్నారు. దానికి రాజమండ్రిలో వుండే హితకారిణీ హైస్కూలులో వున్న సీనియరు తెనుగు పండితుడన్నారు. శాస్త్రి "సత్యవతి ఆయనికి చుట్ట మేమో" అనగా వారు "కావచ్చు" నన్నారు.

మర్నాడు రామశాస్త్రి చెప్పిన మాటలు పత్రికలో పడ్డాయి. అయితే అందుకామే అంగీకరించినట్లు పుస్తక భాండాగారం వారు శాస్త్రికి తెలియపరిచారు.

ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. "ఎక్కణ్ణుంచో వో పిల్ల వొచ్చి రామశాస్త్రి గారితో వాదం చేస్తుంది" అని పట్నం అంతా వొకటే పుకారైపోయింది. స్త్రీలందరూ "ఆ అమ్మాయి యెంత చదువుకుందో తప్పకుండా ఆవేళ సభకి వెళ్ళాలి. ఏమో నువ్వు వస్తావటో వోవిడా ...... సుబ్బమ్మా, కాంతమ్మా కెప్పుడూ తీరుపడీ వుండదు" అంటూ యిలాగ ఆత్రపడసాగారు.

## 5

ఆదివారం వచ్చింది. శనివారం మొదలుకునే ఏ బండిలోనో సత్యవతి వస్తుం దని కొందరు స్టేషనుకి వెళ్ళారు. కొందరు వాణీవిలాస పుస్తక భాండాగారం సెక్రటరీని ఆవిణ్ణిగురించి చాలా అడిగారు కాని అతను "సభలో చూస్తారుకాదూ"

అనే కాని ఆమెని గురించి యేమీ చెప్పలేదు. మధ్యాహ్నం మూడుగంటలకే శాస్త్రి డ్రెస్సు వేసుకుని ప్రమాణంగా చూపవలసిన గ్రంథాలన్నీ వకచోట పెట్టుకున్నాడు. కొందరు స్నేహితులూ, శిష్యులూ, పరిచితులూ వచ్చి పలకరించి వెళ్ళిపోతున్నారు. "తీరా సమయానికి గొంతుకు పోతుం దేమో" అని అనుమానిస్తూనే అతను లెక్కా పత్రమూ లేకుండా కిళ్లీలు నమిలేస్తున్నాడు. రెండు మూడు సోడాబుడ్లుగూడా తాగేసి జేబులో వకతులం లవంగాలూ, నాలుగుపుంజీల పిప్పరమెంటు బిళ్ళలూ వేసుకున్నాడు.

సులోచనా లెన్సోమాట్లు తుడుచుకున్నాడు. తలపాగా యెన్నోమాట్లు సర్దుకున్నాడు కోటు ఎన్నోమాట్లు సవరించుకున్నాడు. బహుమతీ గెలిస్తే కొనవలసిన పుస్తకా లేమిటో కేట్లాగు లన్నీ తిరగవేసి జాబితా రాసుకున్నాడు. తాను వోడిపోతే అవలంబించవలసిన వ్యావహారికంలో యేం విశేషం వుందో దాన్ని కొంద రాచరించడానికి దానిలో వుండే మాధుర్యం యేమిటో అని విచారం మొదలుపెట్టాడు. వెంటనే ఆ విషయాన్ని పరిష్కరించుకోవడంకోసం సత్యవతి కథల పుస్తకం తీసాడు. "పాడుభాష" అనుకుంటూనే నాలుగైదుచోట్ల యేడెనిమిది పేజీలు చదివేటప్పటికి అందులో యిదివర కవగాహనం కాని కొత్త విశేషం వున్నట్లు అతనికి తోచింది. కొన్ని వాక్యాలు వజ్రపుతునకలు లాగా అమృతసాగరతరంగాలులాగా కనపడ్డా యతనికి. వాట్లని గ్రాంధిక భాషలోకి మార్చి తారతమ్యం చూడగా తను రాసిన వాక్యాలు మసిబొగ్గుల్లాగా వుప్పుసముద్రపు కెరటాలలాగా తోచాయి. దానిమీద ఒకటి రెండు కథలు చదివేశాడు.

దానితో అతని యినపహృదయంలో కీటకం ప్రవేశించింది. అతనితో చెప్పకుండానే అతని హృదయం "వ్యావహారిక భాషలో మంచి మాధుర్యం వుంద"ని పలికింది. కాని బెట్టుసరి తగ్గలేదు. "ఈ సత్యవతి గ్రాంధికభాషలోనే ఈ కథలు రాస్తే దేశం అంతా బ్రహ్మరథం పట్టి వుండు నీపాటి" కనుకున్నాడు. "నే నామెకి పాదసేవ చేస్తా" ననుకున్నాడు. ఇలా అనుకునేటప్పటికి అంతరాత్మ "ఆ సరదా తీరుతుంది" అని దీవించిన ట్లయింది.

అత నిలాగ కిందా మీదా పడుతూ వుండగా తల సగంసగం దువ్వుకుంటూ రుక్మిణి "మీకూ ఎవరికో పిల్లకీ వాదం జరుగుతుందట కాదూ యీవేళ సభలోనూ, ఆడపిల్లతో మీకు వాదం యేమి టండీ వోడినా కష్టమే నెగ్గినా కష్టమే మీకూ. మానెయ్యరాదు టండీ" అంది "చా చెప్పావుమాట. నీకేం తెలుసు నాసంగతులు. ఆడ దైతే మాత్రం శాస్త్రవిషయం చర్చకి వచ్చినప్పుడు వూరుకుంటానూ ఇక నేను చదువుకున్న చదువంతా యేం చెయ్యనూ నిమిషంలో గెలుస్తాను నేను" అన్నాడు శాస్త్రి ఇంకా నాలుగైదుమాట్లు ఆమె యిలాగే చెప్పింది కాని అతను వినలేదు. పైగా పౌరుషం యెక్కు వయింది కూడానూ దానిమీద "అయితే నేనూ వస్తాను సభకి. ఈ వీధి వాళ్ళంతా వెడతారుట ఆడాళ్ళు" అని యామె చెప్పగా సరే అన్నాడతను.

నాలుగయింది. సభ నేర్పరచినవారు తనకి బండి పంపిస్తారా తనే కుదుర్చుకోవాలా? ఈ చర్చలో వుండగా యిద్దరు ముగ్గురు స్నేహితులు వచ్చి "టౌనుహాలు చాలే టట్లు లేదు. జనం కిటకిట లాడుతున్నారు. ఆడాళ్లు రోడ్డుమీద నుంచుని వున్నారు. సభని చింతామణీ నాటకశాలకి మారుస్తారట." అని చెప్పి వెళ్లిపోయారు.

వెంటనే రుక్మిణి వచ్చి ముసిముసి నవ్వులు నవ్వుతూ యెదట నుంచుంది. అతను గంభీరంగా చూశాడు. ఆమె నవ్వు మానలేదు. వక్క క్షణం అయిన తరవాత అతను "ఏమంటా" వన్నాడు. "ఏం చీర కట్టుకోను చెప్పండీ" అని ఆమె అలా మందహాసంతోనే అడగ్గా "నీయిష్టం" అన్నాడు "అలా కాదు చెబుదురూ" అని మళ్ళీ అడగ్గా "నన్నిప్పు డిదా అడగడం నా మనస్సంతా సభమీదా, సత్యవతిమీదా – అంటే ఆమె వాదంమీదా వుంది." అన్నాడు.

"అదేమిటండోయి"

"ఏం"

"మీమనస్సు సత్యవతిమీద–"

"ఏదోమాట వచ్చేసింది నోరు జారి"

"మనస్సు కూడా–"

"ఛా వూరుకో – నాయెదుట అట్టే మాట్లాడకు. ఇప్పుడు వెళ్ళిపో – ఇదిగో చూడు నీకు సభకి వెళ్ళా లంటే తొరగా వెళ్ళకపోతే తరవాత చోటు దొరకదు"

"నేను మీ భార్యనే కనక నాకూ దొరుకుతుంది మీకు దొరికినచోట చోటు"

"సభలోకి రాదగ్గ పెళ్ళానివా యేమిటి నువ్వు"

"అలాంటి పెళ్ళాంమీదకి పోతోందా మనస్సూ"

"ఇదిగో చూడూ! నామన స్సెలా వుందో నువ్వెరగవు. ఇలాంటప్పుడా వేళాకోళాలూ వెక్కిరింతలూనూ"

"నేనేం చేశా నండీ యిప్పుడూ! పోనీ నేను రాను లెండీ"

"నీయిష్టం వచ్చినట్లు చేసుకో దాని కిప్పుడు తగు వేం వచ్చిందీ"

ఇది విని "యీసభ యెక్కడ దాపరించిందమ్మా నాకూ" అంటూ విసుక్కుంటూ వెళ్ళిపోయింది. శాస్త్రి మనస్సు పావుగంటదాకా తేరుకోలేదు.

నాలుగున్నర అయింది. ఇంకో పది నిమిషాలయింది. అయిదు నిమిషాలుకూడా అయింది. నాలుగూ యాభై అయింది. బండి రాలేదు? "వీళ్ళకి మర్యాదలు తెలవ" వంటూ అతను నాళంవారి సత్రం దగ్గిరికి వెళ్ళి సొంతంగా జట్కా కుదుర్చుకుని వచ్చి పుస్తకాలు బండిలో వేయించుకుని సభకి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన నాలుగు నిమిషాలకి అతనికోసం మోటారు వచ్చి వెళ్ళిపోయింది. తరువాత యింటికి తాళాలు వేసి రుక్మిణికూడా తోటి స్త్రీలతో సభకి వెళ్లింది.

# 6

లాంఛనా లన్నీ జరిగాయి. అగ్రాసనాధిపతి ప్రారంభోపన్యాసంచేసి పంచాయితీదార్లని ఏర్పరిచి రామశాస్త్రి వాదం ప్రారంభించ మన్నాడు. అతను ప్లాటుఫారంమీదకి వెళ్ళేటప్పటికి సభలోనుంచి "సత్యవతిగా రెవరో మేము చూడాలండోయి" అని పదిమంది కేకలువేశారు. "ఆమె కులస్త్రీ. ఇక్కడికి వచ్చేవుంది. సమయం వచ్చినప్పుడు మీకందరికీ కనపడుతుంది. అంతవరకూ శాంతించా" లని అగ్రాసనాధిపతి వారిని సద్దుపాటు చెయ్యగా రామశాస్త్రి ఖంగుమని తన వాదాన్ని ప్రతిపాదిస్తూ రాసుకుని వచ్చిన వుపన్యాసం చదివాడు. వ్యావహారిక భాషాప్రియులు "భావాలకి నూత్న పదరచన తప్ప కొత్తవిషయం లే" దనగా గ్రాంధికవాదులు "చరిత్రాత్మకమైన వుపన్యాసం" అని మెచ్చుకున్నారు.

అప్పుడు ప్రెసిడెంటు లేచి "శాస్త్రిగారిలాగే సత్యవతమ్మగారుకూడా తమ వుపన్యాసాన్ని రాసుకుని వచ్చారు. అది చదవడం అయినాక శాస్త్రిగారు ఆశువుగా వాదం ప్రారంభిస్తారు. అప్పుడా మెకూడా అలాగే చేస్తారు. ఆమె వుపన్యాసం మాత్రం భాండాగారం సెక్రటరీగారు చదువుతా" రన్నాడు. దానిమీద మళ్ళీ గోల ప్రారంభం కాగా ప్రముఖులు పదిమందీ లేచి ఎలాగో బ్రహ్మాండంమీద మళ్ళీ సర్దుంచారు.

సత్యవతి వుపన్యాసాన్ని సెక్రటరీ చదివాడు. దాన్ని విని వ్యావహారిక వాదులు "సెబాష్" అన్నారు. గ్రాంధిక వాదులకి కొంచెం అపజయశంక కలిగింది. రామశాస్త్రి ముఖాముఖీని వాదం ప్రారంభించాటప్పటికి ముచ్చెమటలూ పోశాయి. మాటలలో వుండే గాంభీర్యమూ దడదడలూ తగ్గిపోయాయి. పట్టుదలకోసం తెగించి మాట్లాడుతున్నా డని చాలామంది అనుకున్నారు. మొత్తానికి మొదట గంటసేపు వుపన్యసించా లనుకున్న శాస్త్రి పది నిమిషాలలో ముగించి కూచున్నాడు.

"సత్యవతిగారు" అని మళ్ళీ కేకలు ప్రబలగా ప్రెసిడెంటు లేచి ఆమె వస్తున్నారు. ఎవరూ చప్పట్లు కొట్టవద్దు. ఎవరూ మాట్లాడవద్దు. ఆమె అందరికీ కనపడీలాగ ఈ బల్లమీద నుంచుని మాట్లాడుతారు కనక యెవరూ లేవవద్దు. మీరు శాంతంగానూ, మౌనంగానూ కూచోడమే ఆమెకి స్వాగతం యివ్వడం" అని చెప్పికూచున్నాడు. వెంటనే సభ అంతా విస్తరంగ సముద్రంలాగ గాంభీర్యం వహించింది.

"ఆమెని తీసుకురండీ" అని ప్రెసిడెంటు సెక్రటరీతో చెప్పగా అత నొకడికేసి చూశాడు. అతను ఇంకొకడి కేసి చూడగా యింకొకడు మరొకడికేసి చూశాడు. ఇలాగ నలుగురైదుగురు చూపులు విసురుకునేటప్పటికి చివరి చూపు శోభనాచలంమీద పడింది. అతను బల్లమీద వున్న కాలింగుబెల్ వాయించగా తెరచాటునుంచి గంధర్వరమణివలె వక యువతి వచ్చి శిరము వంచుకొని మోడ్పుకేలుతో శాస్త్రి యెదట నుంచుంది.

తల యెత్తి చూశాటప్పటికి యెదట రుక్మిణి. శాస్త్రికి చైతన్యం లోపించిపోయింది. ఏదో అనా లనుకొన్నాడు గాని నోట మాట రాలేదు. ఇంతట్లో సభ అంతా లేచి నుంచుంది. "సత్యవతిగారు టేబిలుమీది కెక్కాలి" అని కేకలు ప్రబలిపోయాయి. శోభనాచలం యిక లాభం లేదని చెప్పగా రుక్మిణి బల్లమీద నుంచుంది. అందర్నీ కూచో మని శోభనాచలం "ఈమె నా చెల్లెలు. రామశాస్త్రిగారి భార్య. పేరు రుక్మిణి. సత్యవతి అనేది యీమెకే మారుపేరు. మొట్టమొదట లోకం తన కథలను హర్షిస్తుందో హర్షించదో అనే భయంచేత మారుపేరు పెట్టుకుంది తరువాత ఆపేరు అందరికీ పరిచితం కావడంచేత పుస్తకాన్ని గూడా ఆపేరుతోటే ప్రకటించాము. అయితే మొదటి కథమీదే బావగారు ఖండన ప్రారంభిచడంచేత మారుక్మిణి కవిత్వం సంగతి అతిరహస్యముగానే వుండిపోయింది. బావగారు స్కూలులో వున్నంతసేపూ ఆమె తలుపులు బిగించుకొని యింటో కూచుని కథలు రాయడమూ, పుస్తకాలూ పత్రికల్లూ చదవడమూ వ్యాసాలు రాయడమూ తప్ప వేరే పని యెరగదు. ఆమె పెట్టిలో ఏలాంటి పుస్తకాలూ ఎలాంటి పత్రికలూ వున్నాయో నేటివరకూ - యిప్పటివరకూ బావగా రెరగ" రని చెప్పి కూచున్నాడు.

అప్పుడు రుక్మిణి అందరికీ నమస్కరించి "మీరంతా నన్ను క్షమించాలి. ఇలాంటి సభలో వారికి నేను ప్రతివాదం చెయ్యలే" నని బల్లదిగి నుంచుంది. సభలో చాలామంది వల్లకా దన్నారు. కొందరు తప్పు లే దన్నారు. కొందరు తప్ప దన్నారు. ప్రసిడెంటు ఏమీ చెయ్యలేకపోగా వెంటనే రామశాస్త్రి లేచి రుక్మిణిని బల్లమీద నుంచో మని "రుక్మిణీ సత్యవతి అనే సంగతీ, యీమె కథలు రాస్తుం దనే సంగతీ మీ కెప్పుడు తెలిసిందో నాకూ అప్పుడే తెలిసింది. జరిగిం దంతా మాబావ చెప్పగా మీరు వినే వున్నారు. ఇవాళ మూడుగంటలికి నాహృదయంలో కీటకం ప్రవేశించింది. అయి దయాటప్పటి కది వ్యావహారికంమీద ఆదరాన్ని పుట్టించింది. కాని పట్టుదల విడవలేక నేను నావాదాన్ని ప్రతిపాదించాను. ఈ వాదంలో నేను వోడిపోయాను. జయం రుక్మిణిదే" అన్నారు.

అంతా తలోమాటా మంచీ చెడ్డాకూడా చెప్పుకున్నారు. రుక్మిణి యింటికి వెళ్లి తన విజయాన్ని భర్త పాదాలకి సమర్పించా లని తొందరపడుతోం దని శోభనాచలం చెప్పగా ప్రెసిడెంటు ఆమెకి బహుమతీ యిచ్చేసి సభచాలించాడు. సభలో వున్నవారంతా పెద్ద వుత్సవంతో ఆదంపతుల్ని వూరేగించి యింటో దిగపెట్టి యెవరిదారిని వారు వెళ్ళిపోయారు.

*(అక్టోబరు 1927, 'సుభాషి' మాసపత్రిక)*